సాక్షి
కర్నూలు
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఊయలసేవ, పల్లకీ సేవలు నిర్వహించారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు అధికారులు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలకు దరఖాస్తులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు, కడప జోన్-4 వారి పరిధిలోని 32 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్/మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగాలను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆర్‌డీ డాక్టర్ రత్నకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల నమూనా, నెలసరి వేతనం, ఇతర వివరాలు http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని భర్తీ చేసి, నిర్దేశించిన రుసుముతోపాటు సర్టిఫికెట్లను జతపరిచి వచ్చే నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రాంతీయ సంచాలకులు, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, కడపలో అందజేయాలన్నారు.

ముగింపు దశకు కొత్త పింఛన్ల పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓల ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్త పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని ఏఓ షరీఫ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వెరిఫికేషన్‌లో అర్హులని తేలితే జనవరి 1 నుంచి రూ.3,000 ప్రకారం పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మార్కెట్ కమిటీలకు రూ.18.28 కోట్ల ఆదాయం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఒక్క శాతం ఫీజు ద్వారా ఎనిమిది నెలల్లో రూ.18.28 కోట్ల ఆదాయం వచ్చిందని జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ఫీజు ద్వారా 2023-24 సంవత్సరంలో రూ.30.85 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. ఎనిమిది నెలల్లో 59.25 శాతం వసూలైందన్నారు. అందులో ఆదోని వ్యవసాయ మార్కెట్ నుంచి రూ.8.23 కోట్లు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ రూ.4.15 కోట్లు, ఎమ్మిగనూరు మార్కెట్ రూ.3.47 కోట్లు, ఆలూరు మార్కెట్ రూ.69.90 లక్షలు, పత్తికొండ మార్కెట్ రూ.38.49 లక్షలు, కోడుమూరు మార్కెట్ రూ.74.92 లక్షలు, మంత్రాలయం మార్కెట్ కు రూ.58.6 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. మార్చి చివరిలోపు 100 శాతం లక్ష్యాలు సాధిస్తామని ఆయన తెలిపారు.

అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ సేద్యం

- ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పిస్తామని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ సేద్యంపై ఇటీవల వచ్చిన విమర్శల్లో వాస్తవం లేదన్నారు. జిల్లాలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారులు, రైతుభరోసా కేంద్రాల వ్యవసాయ/ఉద్యాన/పట్టుపరిశ్రమ సహాయకుల ద్వారా బిందు, తుంపర్ల పరికరాలకు ఇచ్చే రాయితీలు, అమలు విధానంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. 2022-23 సంవత్సరంలో 3,700 హెక్టార్ల లక్ష్యానికి 4,485 హెక్టార్లకు సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించామన్నారు. 2023-24లో 5,000 హెక్టార్లు లక్ష్యం కాగా 11,108 మంది రైతులు 11,443 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇందులో 4,456 మంది రైతులు నాన్ సబ్సిడీ అమౌంట్ ఆన్‌లైన్ ద్వారా చెల్లించడంతో 4418 మంది రైతులకు 4144 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు మంజూరయ్యాయన్నారు. 3734 హెక్టార్లకు పరికరాలు, మెటీరియల్ సరఫరా చేశామని, వీటిని రైతుల భూముల్లో అమర్చే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. జనవరి చివరిలోపు 100 శాతం లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే 08518-279724, టోల్‌ఫ్రీ నంబరు 18004252960 ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఆరోగ్యం.. ఆదాయం

కెమికల్స్ లేని ఆహార పంటల సాగుతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆదాయం సమకూరుతోంది. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(గ్యాప్) పద్ధతులతో పండించిన దిగుబడులకు ప్రభుత్వం ఆర్గానిక్ సర్టిఫికెట్లు జారీ చేసి అన్నదాతలను ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేలా రైతన్నలకు అండగా నిలుస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలకు అనుగుణంగా కొర్ర పండించిన 49 మంది రైతులకు ఇండ్ గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు అందజేసింది. వరి సాగు చేసిన మరో 50 మంది రైతులకు త్వరలో అందజేయనుంది. – కర్నూలు(అగ్రికల్చర్)

- కెమికల్స్ లేని ఆహార పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం
- కొర్ర, వరికి మొదటి సారిగా ఆర్గానిక్ సర్టిఫికెట్లు
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ



నంద్యాల జిల్లా డోన్ మండలంలోని గోసానిపల్లి కేంద్రంగా ప్రకృతి వ్యవసాయ స్వశక్తి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటైంది. దీనిని మ్యాక్స్ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సంఘంలో ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద 49 మంది రైతులు 63 హెక్టార్లలో ఎస్ఐఏ 3156 రకం కొర్ర సాగు చేశారు. డోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఏఓ అబ్దుల్‌షఫీ వారం, వారం వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. కెమికల్స్ లేకుండా 100 శాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేశారు. గ్యాప్ పద్ధతులు పాటించడం వల్ల ఎకరాకు రూ.5 వేల వరకు ఖర్చు అయ్యింది. పంట దిగుబడులు ఎకరాకు 4-6 క్వింటాళ్ల వరకు వచ్చాయి. పంటను శ్యాంపిల్స్ తీసి గుంటూరులోని వ్యవసాయ శాఖ ల్యాబ్‌కు పంపారు. ఇందులో ఎటువంటి కెమికల్స్ లేవని నిర్ధారించారు. పూర్తిగా ఆర్గానిక్ గ్యాప్ పద్ధతులకు లోబడి పండించినట్లు ఫలితాలు వచ్చాయి.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

కెమికల్స్ లేకుండా కొర్ర పండించిన రైతులకు ఇటీవల ప్రభుత్వం ఇండ్ గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు జారీ చేసింది. ప్రభుత్వం చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందువల్ల ఉమ్మడి జిల్లాలో కొర్ర సాగు పెరిగింది. మామూలు పద్ధతుల్లో పండించిన కొర్రలు క్వింటాల్‌కు రూ.5,000 వరకు ధర లభించింది. డోన్ మండలం ఎర్రగుంట్లలో గ్యాప్ పద్ధతులతో పండించిన కొర్రలకు రూ.7,000 ధర లభించింది. ఎకరాకు రూ.5,000 పెట్టుబడి పెట్టగా నికరాదాయం రూ.30 వేల నుంచి రూ.38 వేల వరకు పొందారు. ఈ ఏడాది కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ చిరుధాన్యాల కింద కొర్ర సాగు చేసిన రైతులు లాభాలు సాధించారు. అయితే గ్యాప్ పద్ధతులతో పండించిన రైతులు కూడా మరింత లాభాలు పొందారు.

కెమికల్స్ లేని ఆహార పంటలకు డిమాండ్

కెమికల్స్ లేని ఆహార పంటలకు ప్రస్తుత సమాజంలో డిమాండ్ ఉంది. కలుషితమైన ఆహారం తిని అనారోగ్య సమస్యల భారిన పడిన ఎంతో మంది ఇప్పుడు కొర్రలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో కొర్రలకు గిరాకీ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో వరి బియ్యం కంటే కొర్ర బియ్యాన్ని రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. కెమికల్స్ లేకుండా పండించిన ఆహార ఉత్పత్తులను వందలాది మంది వినియోగదారులు ధరలను పట్టించుకోకుండా కొనుగోలు చేస్తున్నారు.



డోన్ మండలం ఎర్రగుంట్ల రైతులు ఆర్గానిక్ సర్టిఫికెట్లు పొందుతున్న దృశ్యం

ఎకరాకు రూ.47 వేల ఆదాయం



ఈ ఏడాది రెండు ఎకరాల్లో కొర్ర సాగు చేశాం. సారోళ్లు వారం వారం వచ్చి ఏమేమి చేయాలో చెప్పేటోళ్లు. వాళ్ల సెప్పినట్లే సేశాం. ఎకరాకు రూ.4,500 ప్రకారం రెండకరాలకు రూ.9,000 ఖర్చయ్యింది. వానలు సరిగా పడకపోవడంతో దిగుబడులు ఎకరాకు 4 క్వింటాళ్లు వచ్చాయి. మేం పండించిన కొర్రలు మంచివి అని ప్రభుత్వం కాగితం ఇచ్చింది. దీంతో క్వింటం రూ.7,000 లాగా అమ్మేశాం. ఖర్చులు తీసేసి ఎకరాకు రూ.47 వేలు లాభం వచ్చింది. – ఎస్.లక్ష్మీదేవి, ఎర్రగుంట్ల, డోన్ మండలం

వరి శ్యాంపిల్స్‌లోనూ..

కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం కొండాపురం గ్రామంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద 50 మంది రైతులు 25 హెక్టార్లలో వరి సాగు చేశారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, సి.బెళగల్ ఏఓ మల్లేష్ యాదవ్ పంట కోత వరకు వైఎస్ఆర్ పొలంబడి నిర్వహించి గ్యాప్ పద్ధతులు పాటించే విధంగా చొరవ తీసుకున్నారు. 16 మంది రైతులకు ఒకటి, మరో 16 మంది రైతులకు మరొకటి, 18 మంది రైతులకు సంబంధించి ఇంకొకటి శ్యాంపిల్స్ తీసి గుంటూరులోని వ్యవసాయ శాఖ ల్యాబ్‌కు పంపారు. ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షల్లో వరి ధాన్యంలో కెమికల్స్ లేవని వ్యవసాయ శాఖకు సమాచారం అందింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే వీరికి ఇండ్ గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు జారీ కానున్నాయి. వర్షాభావం వల్ల వరిలో 10-20 శాతం వరకు దిగుబడులు తగ్గినప్పటికీ కెమికల్స్ లేకుండా పండించడం, అధికారికంగా ఇండ్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు జారీ కానుండటంతో గిట్టుబాటు ధరలు లభించనున్నాయి. మామూలు పద్ధతులతో పోలిస్తే గ్యాప్ పద్ధతులతో పండించిన బియ్యానికి మార్కెట్‌లో 50 శాతం వరకు అధిక ధర లభించే అవకాశం ఉంది.



సి.బెళగల్ మండలం కొండాపురం గ్రామంలో వరి సాగులో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమం

రెండు కోడిగుడ్లు @ రూ. 4,500

ఆస్పరి: క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రార్థనల్లో ఉంచిన రెండు కోడిగుడ్లను ఓ భక్తుడు రూ.4,500కు వేలంలో దక్కించుకున్నాడు. మండలంలోని కారుమంచి గ్రామంలో గ్రామానికి చెందిన దేవసహాయం రెండు కోడిగుడ్లు, ఉసేని పొట్టేలు, హనుమంతమ్మ కోడిపుంజును చర్చికి విరాళమిచ్చారు. వాటిని క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనల్లో ఉంచారు. సోమవారం రాత్రి పాస్టర్ కరుణాకర్, ఏబీఎం సంఘం పెద్దలు చెన్నప్ప, దేవదాసు, దిలిఫ్, నరసన్న, రూబిన్, బజారి సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. రెండు కోడి గుడ్లను రూ.4,500లతో త్యాగరాజు, పొట్టేలును రూ.8,950లకు ఇజ్రాయిల్, కోడిపుంజును రూ.2 వేలకు హరిశ్చంద్ర దక్కించుకున్నారు. వేలం ద్వారా సమకూరిన నగదును చర్చి అభివృద్ధికి ఉపయోగిస్తామని సంఘం పెద్దలు తెలిపారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 27 నుంచి జనవరి 3వ తేదీ వరకు జరగనున్న ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ అధికారులతో కలసి సమీక్షించారు. పరీక్షా కేంద్రాలుగా అయాన్ డిజిటల్, కేవీ సుబ్బారెడ్డి అయాన్ డిజిటల్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్, బృందావన్ ఇన్‌స్టిట్యూట్, సెయింట్ జాన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలను ఎంపిక చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఆన్‌లైన్ పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే గవర్నమెంట్ పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల ఎంపిక కోసం జనవరి 4న స్క్రీనింగ్ టెస్టును నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ అధికారులు కెజియా ప్రసూన, వెంకటరమణ తెలిపారు.

ఈ-హాస్పిటల్ నిర్వహణలో జీజీహెచ్ నంబర్ వన్

కర్నూలు(హాస్పిటల్): ఈ-హాస్పిటల్ నిర్వహణలో రాష్ట్రంలోనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నంబర్ వన్‌గా నిలిచిందని, దేశంలో నాలుగో ర్యాంకును సాధించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీ లక్ష్యాలను పూర్తి చేసిన సందర్భంగా, మరింత పటిష్టంగా అమలు చేసిన హెచ్‌ఓడీలను అభినందించారు. రాష్ట్రంలో కోవిడ్ జేఎన్-1 కేసులు పెరుగుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలోని మూడు చోట్ల కోవిడ్ జేఎన్-1 టెస్ట్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అందులో పీడియాట్రిక్స్, పల్మనాలజీ, ఎఫ్ఎంసీలలో కోవిడ్ జేఎన్-1 ఆర్‌టీపీసీఆర్ టెస్ట్‌లను ప్రతిరోజూ వంద నుంచి 200 వరకు నిర్వహించాలని హెచ్‌ఓడీలకు ఆదేశించారు. ఏఎంసీ విభాగంలో రోగులకు కావాల్సిన పరికరాలు, వసతులపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, రేడియాలజీ, గైనిక్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు నైట్ డ్యూటీలో ఉండాలన్నారు. కొన్ని అత్యవసర సేవా విభాగాల్లో ఎంసీహెచ్, ఏఎంసీ వార్డులకు ఒక ప్రత్యేక అధికారిని నియమించామని వీరు సెక్యూరిటీ, శానిటేషన్ పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

అట్టహాసంగా క్రీడా సంబరం

- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు
- క్రీడాజ్యోతులు వెలిగించి పోటీలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు



క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా హట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి క్రీడాజ్యోతులు వెలిగించి పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రాలయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, పాణ్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరులో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కర్నూలులో మేయర్ బీవై రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా, క్రీడల జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో తలపడాలని క్రీడాకారులకు సూచించారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడాపోటీలు

క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తోందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడలకు శ్రీకారం చుట్టారన్నారు. ఐదు క్రీడాంశాల్లో, ఐదు దశల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ ఉన్న వారిని గుర్తించి నగదు బహుమతులతో ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్, ఇండియా డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జాఫ్రిన్ మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించేందుకు రాష్ట్రప్రభుత్వం తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాపోటీలు ఫిబ్రవరి 10వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుబాష్ చంద్రబోస్, పార్టీ నాయకులు, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, ఆడుదాం ఆంధ్రా కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు గాజుల శ్వేతా రెడ్డి, విక్రమసింహారెడ్డి, ఆర్షియా పర్వీన్, షేక్ యూసుఫ్, ఫరాజ్‌ఖాన్, మునెమ్మ, నారాయణ రెడ్డి, షాషావలీ, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేథార్‌నాథ్ పాల్గొన్నారు.



కృష్ణగిరి మండలం కటారుకొండలో వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వైభవంగా శ్రీశైల గిరి ప్రదక్షిణ




గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం సాంప్రదాయబద్ధంగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల పల్లకీ ఊరేగింపుతో శ్రీశైలగిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం మీదుగా గణేషసదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం వద్దకు, అక్కడ నుంచి ఆలయ మహాద్వారం వద్దకు గిరిప్రదక్షిణ చేరుకుంది. ఇలకైలాసంగా ప్రసిద్ధమైన శ్రీశైల మహాక్షేత్రంలో గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ఫలప్రదమని పండితులు చెప్పారు.



పాఠశాలల రూపురేఖలు మారాయి



గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. నాడు నేడు పనులతో అదనపు గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు విద్యుత్, తాగునీటి వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారు. జగనన్న విద్యాదీవెన పేరుతో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు, షూ, టై, బెల్టు, బ్యాగులను అందిస్తూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుండటంతో ప్రవేశాలు కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నాయి.

– హెచ్.ఈరన్న ఉపాధ్యాయుడు బదినేహాలు, ఆదోని మండలం

ఎంతో సాయం చేశారు



మాలాంటి కుల వృత్తుల వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో సాయం చేశారు. చేదోడు పథకం ద్వారా అందించే రూ.10వేల ఆర్థిక సాయంతో పెట్టుబడి కష్టాలు తీరాయి. వరుసగా మూడో ఏడాది పది వేల నగదు ఖాతాలో జమైంది. దుకాణంలో అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకున్నాను. ఇప్పటికే మా బార్బర్ షాపులకు ఉచిత కరెంటు అందిస్తున్నారు. సాంకేతిక యంత్ర పరికరాలు పనిచేయాలంటే విద్యుత్ అవసరం. ఉచిత కరెంటుతో ఆర్థిక భారం కూడా తగ్గిపోయింది. మాకు మంచి రోజులు వచ్చి, ఇబ్బందులు తీరాయి.

– ధనుంజయ, నాయీ బ్రాహ్మణుడు, ఆలూరు

మహానందిలో వైభవంగా ఆరుద్రోత్సవం

మహానంది: మహానందిలో స్వయంభుగా కొలువైన శ్రీ మహానందీశ్వర స్వామి వారికి మంగళవారం రాత్రి వార్షిక ఆరుద్రోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వామికి అన్నాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికులు, అర్చకులు విశేష పూజలు చేపట్టారు. రాత్రి 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు మహానందీశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. లింగరూపంలో ఆవిర్భవించిన మహాశివరాత్రి తరహాలో ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం అంత విశిష్టమైందని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామితోపాటు శ్రీ గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా నవకళశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించి ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తి గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక గుడిలో కొలువైన మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధికి చేర్చి పగల్పత్తు శాత్తుమొరై నిర్వహించారు. సాయంత్రం ఉత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్

క్లుప్తంగా

కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

• నలుగురికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని కర్నూలు రోడ్డు అంపయ్య పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం సాయంత్రం కూలీల ఆటోను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. మండల పరిధిలోని దేవబెట్ట గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో సిరాలదొడ్డి గ్రామ పరిధిలోని పొలానికి పనికి వెళ్లారు. సాయంత్రం గ్రామానికి ఆటోలో బయలుదేరారు. ఘటనా స్థలానికి చేరుకోగానా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో వెనుక సీట్లో కూర్చున్న పార్వతి, లక్ష్మి, రజిత, శకుంతలకు గాయాలయ్యాయి. పార్వతి, రజితలకు రెండు కాళ్లు విరిగిపోయాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పార్వతి, లక్ష్మిలను కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

ఆదోనిలో పట్టపగలే చోరీ


బీరువా తాళాలు పగులగొట్టిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులో ఉన్న భీమిరెడ్డి కాలనీలో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. అజమత్‌భాను తన ఇంటికి తాళాలు వేసి మనవడికి ఆరోగ్యం బాగోలేకపోతే చూసేందుకని హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు చొరబడి బీరువాలోని మూడున్నర తులాల బంగారం, 25 తులాల వెండి, రూ.5 వేల నగదుతో ఉడాయించారు. మంగళవారం ఉదయం ఆమె ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొటి ఉండటం, బీరువా తెరిచి ఉండటం గమనించి చోరీ జరిగిందని నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలం చేరుకున్న డిప్యూటీ సీఎం


మంత్రికి ఆహ్వానం పలుకున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: డిప్యూటీ సీఎం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం రాత్రి శ్రీశైల మహాక్షేత్రానికి చేరుకున్నారు. భ్రమరాంబా అతిథిగృహం వద్ద మంత్రికి దేవస్థానం ఈఓ పెద్దిరాజు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు. బుధవారం క్షేత్ర పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంజామల మండలం ఆల్వకొండ గ్రామానికి చెందిన చిన్న ఖాశీం(42) మానసిక స్థితి కొద్ది రోజులుగా సరిగా ఉండేది కాదు. ఉదయం స్వగ్రామం నుంచి కోవెలకుంట్లకు చేరుకొని హాస్పిటల్ సమీపంలో క్రిమిసంహారక మందు తాగి పడిపోవడంతో స్థానికులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఖాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

ఓటెత్తుతాం!

• యువ ఓటర్ల నుంచి అనూహ్య స్పందన
• నెల రోజుల్లో ఏకంగా 28,039 మంది రిజిస్ట్రేషన్
• తుది ఓటరు జాబితా రూపకల్పనలో 37,396 ఓటర్లు పెరిగే అవకాశం
• పెండింగ్ ఫారాలను పరిష్కరించే దిశగా అధికారులు
• జనవరి 5న తుది ఓటరు జాబితా విడుదలకు చర్యలు

తుది ఓటరు జాబితా చేర్పుల్లో యువ ఓటర్ల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.నెల రోజుల్లో ఏకంగా 28 వేల మంది యువతీ, యువకులు ఓటరు జాబితాలో పేరు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరి దరఖాస్తులను పరిశీలించి జనవరి 5న ప్రకటించే తుది జాబితాలో చేర్చేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు తుది ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. – కర్నూలు(సెంట్రల్)



జి.పుల్లయ్య కాలేజీలో యువతీయువకులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు అక్టోబర్ 27వ తేదీన ముసాయిదా జాబితాను విడుదల చేశారు. అందులో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో కలిపి 18–19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్ల సంఖ్య కేవలం 13,761 ఉండేది. ఈక్రమంలో 18–19 ఏళ్ల మధ్య ఉన్న యువతీ, యువకులను ఓటరుగా నమోదు చేయించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశాలు రావడంతో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి దరఖాస్తులను ఆహ్వానించారు. అనూహ్యంగా 2023 అక్టోబర్ 27 నుంచి 2023 డిసెంబర్ 26వ తేదీ వరకు 41,800 మంది యువతీ, యువకులు ఓటర్లుగా నమోదయ్యారు. ఈ క్రమంలో రెండు నెలల్లో దాదాపు 28,039 మంది యువకులు కొత్తగా ఓటరుగా నమోదై రికార్డు సృష్టించారు. కాగా, పెరిగిన యువ ఓటర్లలో కర్నూలులో 2,929, పాణ్యంలో 5,165, పత్తికొండలో 3,194 మంది, కోడుమూరులో 3,776, ఎమ్మిగనూరులో 3,360, మంత్రాలయంలో 3,307, ఆదోనిలో 3,168, ఆలూరులో 3,140 మంది ఉన్నారు. అత్యధికంగా పాణ్యంలో 5,165 మంది ఓటర్లు నమోదు కాగా, అత్యల్పంగా కర్నూలులో 2,929 మంది ఉన్నారు.

తుది జాబితాలో పెరగనున్న 37,396 మంది కొత్త ఓటర్లు

మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైనప్పటి నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు దానిపై అభ్యంతరాలు స్వీకరించారు. ప్రస్తుతం వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో ముసాయిదా జాబితా ప్రకారం 19,71,325 మంది ఓటర్లు ఉండగా, ఆ సంఖ్య డిసెంబర్ 26వ తేదీ నాటికీ 20,08,721కు చేరుకుంది. అంటే రెండు నెలల్లో దాదాపు 37,396 మంది ఓటర్లు పెరిగారు. కాగా, కొత్తగా పెరిగిన ఓటర్లలో కర్నూలులో 743 మంది, పాణ్యంలో 13,383 మంది, కోడుమూరులో 8,886, ఎమ్మిగనూరులో 1,472, మంత్రాలయంలో 7,148, ఆదోనిలో 2,476, ఆలూరులో 3,258 మంది ఉన్నారు. కాగా పత్తికొండలో ఓటర్లు పెరగకపోవడంతో పాటు మృతి చెంది వారి పేర్లు తొలగించడంతో ఉన్న సంఖ్యకంటే తక్కువగా నమోదైంది.

తుది ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు



2024 జనవరి 5న తుది ఓటరుజాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు వచ్చిన ఫారం–6, 7, 8లను క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయించాం. చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించాం. యువ ఓటర్లను జాబితాలో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికీ ఓటరుగా నమోదు కాని 18–19 ఏళ్ల మధ్య ఉన్న వారెవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని టెక్కె నాగులకట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకులు మధుసాయి తెలిపిన వివరాల మేరకు.. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం వెనుక మార్గం నుంచి ప్రవేశించి, కటాంజనం తలుపులు పగులగొట్టి హుండీని అపహరించి అందులోని దాదాపు రూ.40 వేల నగదు దోచుకు వెళ్లారన్నారు. ఉదయం భక్తులు ఆలయం వద్దకు చేరుకుని ఆలయం కటాంజనం తలుపులు విరిచి ఉండటాన్ని గమనించి నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని చోరి జరిగినట్లు నిర్ధారించుకుని రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిందితులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ముగ్గురు నిందితులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి రెండు రోజులు జైలు శిక్షను మంగళవారం ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. వివరాల మేరకు పట్టణానికి చెందిన రంజిత్, షేక్‌రియాజ్, షేక్ మన్సూర్‌బాషాలు స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద దారినపోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిపై కేసు నమోదు చేశారు. అరెస్టుచేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఒక్కొక్కరికి రెండు రోజులు జైలుశిక్షను విధించారు.

శ్రీగిరికి అభివృద్ధి వరమాల

• రూ.215.04 కోట్లతో నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
• హాజరుకానున్న డిప్యూటీ సీఎం సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా


శ్రీశైల క్షేత్రం

శ్రీశైలంటెంపుల్: తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల మహాక్షేత్రాన్ని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఏటేటా రద్దీ పెరుగుతున్న దృష్ట్యా భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పకడ్బందీ ప్రణాళికతో పనులు చేపడుతోంది. ఈ మేరకు బుధవారం రూ. 215.04 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన జరుగనుంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తదితరులు ప్రధానాలయానికి ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. రూ.75 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణం, రూ.52 కోట్లతో 200 గదుల వసతి సముదాయం, రూ.35 కోట్లతో సాలుమండపాల నిర్మాణం, శివం రోడ్డు సుందరీకరణ, రూ.23.40 కోట్లతో శివసేవకులకు వసతిగృహ నిర్మాణం, రూ.7 కోట్లతో వన్‌మెగా వాట్ సోలార్‌పవర్ ప్లాంట్ నిర్మాణం, రూ.5.85 కోట్లతో దేవస్థాన ఉద్యోగుల నివాస సముదాయానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సబ్‌స్టేషన్ నిర్మాణం, రూ.5.50 కోట్లతో హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి డంపింగ్‌యార్డ్ వరకు కాంక్రీట్‌రోడ్డు నిర్మాణం, రూ.2.60 కోట్లతో వెయ్యి కిలో లీటర్ల వాటర్‌స్టోరేజ్ రిజర్వాయర్ నిర్మాణం, రూ.2 కోట్లతో ఐదు వందల కిలో లీటర్ల వాటర్ స్టోరేజ్ రిజర్వాయర్ నిర్మాణం (హఠకేశ్వరం), రూ.1.60 కోట్లతో 500 కిలో లీటర్ల వాటర్‌స్టోరేజ్ రిజర్వాయర్ నిర్మాణం (ఫిల్టర్‌బెడ్ ఏరియా), రూ.1.98 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణం (దోర్నాల), రూ.1.26 కోట్లతో షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణం (దోర్నాల), రూ.99 లక్షలతో అమ్మవారి ఆలయంలో ఉత్తర సాలుమండపాల పునర్నిర్మాణం, రూ.86 లక్షలతో పంచమఠాల చుట్టూ కంచె.. ఇలా మొత్తం రూ.215.04 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

భక్తకోటి మెచ్చేలా..

శ్రీశైల మహాక్షేత్రానికి భక్తుల రాక గణనీయంగా పెరగడంతో భక్తుల అవసరార్థం రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. గతంలో ఎన్నడూ చేయని విధంగా పలు అభివృద్ధి పనులు చేపడుతుండటంతో భక్తులు హర్షిస్తున్నారు. శ్రీశైల ఆలయ చరిత్రలో ఇంత వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఒకే సారి రూ.215.04 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తుండటం విశేషం. రాష్ట్రప్రభుత్వం హిందూ ధర్మానికి, ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందనేందుకు ఇదే నిదర్శనమని భక్తులు చర్చించుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ఆలయాల అభివృద్ధిపై దేవదాయశాఖ మంత్రి, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా ఆలయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు చర్యలపై అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయా క్షేత్రాలకు వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యాలకు లోనవకుండా దర్శనం, వసతి, వివిధ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

జిల్లాలో మూడేళ్ల పాటు పని చేసిన వారి జాబితాను సిద్ధం చేయండి

• రాయలసీమ రేంజ్ ఎస్పీలతో డీఐజీ సమీక్ష


రాయలసీమ రేంజ్ ఎస్పీలతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షిస్తున్న డీఐజీ సింథిల్‌కుమార్

కర్నూలు: మూడేళ్లపాటు ఒకే జిల్లాలో పని చేసిన పోలీసు అధికారుల జాబితాను సిద్ధం చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సింథిల్ కుమార్ ఎస్పీలకు సూచించారు. కర్నూలు బీ క్యాంప్‌లోని రేంజ్ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో సింథిల్‌కుమార్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉద్యోగుల బదిలీలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. పోలీసు రికార్డుల బదిలీలు, ఎన్నికలకు సంబంధం ఉన్న వారు, దీర్ఘకాలికంగా ఒకేచోట ఉన్న వారిని ఎన్నికల విధులలో ఉండకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. మూడేళ్లుగా ఒకే జిల్లాలో ఉన్న వారిని కొనసాగించకూడదని సూచించిందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసు శాఖలోని అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి వరకు, డిప్యుటేషన్లలో పనిచేస్తున్న వారి కాలపరిమితిని బట్టి కొత్త జిల్లాల ప్రకారం జనవరిలోగా చేపట్టాల్సిన బదిలీల ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీలతో పలు అంశాలపై చర్చించారు. కర్నూలు రేంజ్ పరిధిలో గతంలో విధులు నిర్వహించిన పోలీసు అధికారుల రికార్డులను పరిగణలోకి తీసుకుని నివేదికలు సిద్ధం చేసి పారదర్శకంగా బదిలీలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుందని, ఎన్నికల సన్నద్ధత, శాంతిభద్రతల పరిరక్షణపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తల చర్యలు పాటించాలని ఎస్పీలకు ఆదేశించారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు జి కృష్ణకాంత్, కె.రఘు వీర్‌రెడ్డి, సిద్ధార్థకౌశల్, బి.కృష్ణారావు పాల్గొన్నారు.

కంకి నిండా ఆనందం

• 40 ఎకరాల్లో సీడ్ జొన్న సాగు
• ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడికి అవకాశం


జొన్న కంకిని చూపుతున్న రైతు శ్రీపతి ప్రసాద్


కంకులతో కళకళలాడుతున్న సీడు జొన్న పంట

దొర్నిపాడు: ప్రత్యామ్నాయ పంట వైపు దృష్టి సారించిన రైతును అదృష్టం వరించబోతుంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయాధికారుల సూచన మేరకు మండలంలో వరి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. చాలా మంది రైతులు ప్రయత్యామ్నాయంగా జొన్న సాగు చేశారు. ఈ క్రమంలో బుర్రారెడ్డిపల్లెకు చెందిన రైతు శ్రీపతి ప్రసాద్ 40 ఎకరాల్లో సీడ్ జొన్న సాగు చేసి లాభాలు గడించబోతున్నాడు. ముందుగా ఆయన విత్తన పత్తిని సాగు చేయాలని ఎకర పొలం రూ.40వేల ధరతో 40 ఎకరాలకు కౌలుకు తీసుకున్నాడు. ఇంతలో అధికారులు వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, విత్తన పత్తి సాగు చేసుకోవద్దని ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించడంతో వెంటనే ప్రత్యామ్నాయంగా సీడ్‌జొన్న సాగుపై ఆసక్తి చూపాడు. ఈ క్రమంలో కౌలు ధర కూడా తగ్గింది. మండలంలో వరి, మిరప, పత్తికి ఎకరా కౌలు రూ. 40 వేలు ఉంది. జొన్న, ఇతర పంటలకు కౌలు రూ. 15 వేలు కావడంతో రైతు ప్రసాద్‌కు కౌలు వ్యయం తగ్గింది. 40 ఎకరాల్లో సీడ్ జొన్న సాగు చేశాడు. పెట్టుబడిగా ఎకరానికి రూ.20 వేలు వెచ్చించాడు. వాతావరణం అనుకూలించడంతో కంకి అడుగు మేర పొడవు ఉండటం కంకి నిండా గింజలు ఉండటంతో దిగుబడిపై అంచనా పెరిగింది. సాధారణంగా సీడ్ జొన్న ఎకరాకు 15 క్వింటాలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 20 క్వింటాళ్లు వచ్చే అంచనా ఉందని రైతు చెబుతున్నారు. అలాగే సీడ్ జొన్నలను రూ. 4,800తో ఓ సీడ్ కంపెనీతో అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఎకరానికి రూ. లక్ష వరకు వచ్చినా పెట్టుబడులు పోను ఎకరానికి రూ.65 వేలు మిగిలే అవకాశం ఉంది. 40 ఎకరాలకు కౌలుకు రూ. 6 లక్షలు, పెట్టుబడి రూ. 8 లక్షలు పోను దాదాపు రూ.12 లక్షల వరకు నికర ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

ముందు జాగ్రత్తే మందు

• కుష్టు రోగులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే
• నేటి నుంచి వచ్చే నెల 12 వరకు నిర్వహణ
• జిల్లాలో 215 మంది కుష్టు బాధితులు
• జూలైలో నిర్వహించిన సర్వేలో 185 మంది గుర్తింపు
• 1650 బృందాలతో సర్వేకు చర్యలు

ఒకప్పుడు కుష్టు వ్యాధి అంటే చాలా మందికి అదోరకమైన భయం ఉండేది. వారిని చూస్తే కాస్త దూరంగా జరిగేవారు. ఊరికి దూరంగా ఉంచేవారు. క్రమేపీ ప్రజల్లో అవగాహన రావడంతో అందరితో కలిసి సాధారణ జీవితం గడుపుతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అయినా అక్కడక్కడా కేసులు బయటపడుతూనే ఉన్నాయి. శరీరంపై మచ్చలు కనిపిస్తే కుష్టు అని కొందరు అపోహ పడుతుంటారు. మరికొందరు నిర్లక్ష్యం చేస్తారు. అలాంటి వారిని గుర్తించి చికిత్స అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


ఇంటింటి సర్వేలో అనుమానితులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


సర్వే కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లాలో 1,650 బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి బృందంలో ఒక ఆశ, సచివాలయ వలంటీర్లు ఉంటారు. వారు జిల్లాలోని 24,26,723 జనాభాలో 6,43,648 ఇళ్లను సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలిస్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని సమీప ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యులతో పరీక్ష చేయిస్తారు. వ్యాధినిర్ధారణ అయితే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కుష్టువ్యాధి విభాగం లేదా చర్మ వ్యాధుల విభాగానికి పంపించి చికిత్స చేయిస్తారు. ఇదే సమయంలో కేసు బయటపడిన చుట్టుపక్కల 300 ఇళ్లల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారు. కేసు బయటపడిన ఇంటిలోని వారందరికీ కుష్టులేకపోయినా ముందు జాగ్రత్తగా మందులు ఇస్తారు. కుష్టు వ్యాధిగ్రస్తునికి మాత్రం ఒంట్లో పాసివ్ బేసిల్‌లై (తక్కువస్థాయిలో లెప్రసి క్రిములు) ఉంటే 6 నెలలు, మల్టీ బేసిల్‌లై(అధిక శాతం లెప్రసి క్రిములు) ఉంటే 9 నెలల పాటు మల్టీ డ్రగ్ థెరపి(ఎండీటీ) మందులను ఉచితంగా అందజేస్తారు. జిల్లాలో ఆరునెలల క్రితం నిర్వహించిన సర్వేలో 180 మంది కొత్త కేసులుండగా ప్రస్తుతం 215 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారు.

ఏడాది	జిల్లాలో కుష్టు రోగులు
2018	304
2019	342
2020	92
2021	137
2022	167
2023	215

కుష్టు వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వస్తుంది.
- చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు
- చెవులపై బుడిపెలు, కణితులు, తిమ్మిర్లు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- పాదాలు(మడిమలు) వాపు ఉండటం

కుష్టు వ్యాధికి ఉచితంగా చికిత్స

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నాం. ఇప్పటికే మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశాలకు ట్రైనింగ్ ఇచ్చాం. జిల్లాలో మొత్తం 1,650 బృందాలు తిరుగుతాయి. ప్రతిరోజూ 50 నుంచి వంద ఇళ్లు తిరిగి స్క్రీనింగ్ నిర్వహిస్తారు. అనుమానిత కేసులను గుర్తించి ప్రభుత్వాస్పత్రుల్లో వ్యాధినిర్ధారణ చేసి చికిత్స ఇస్తారు. ఒక కేసు గుర్తించిన చోట చుట్టుపక్కల 300 ఇళ్లల్లో స్క్రీనింగ్ చేస్తారు. ఈ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదు. ఆరు నెలలు మందులు వాడితే పూర్తిగా నయం అవుతుంది. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయి. అంగవైకల్యం ఉన్న వారికి శస్త్రచికిత్సను ఉచితంగా చేయించుకోవచ్చు. ఫిజియోథెరపి కూడా చేయిస్తున్నాం.

–డాక్టర్ భాస్కర్, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి, కర్నూలు